క్లుప్తంగా

స్వయం భూ లింగాన్ని తాకిన సూర్యకిరణాలు



లింగంపై పడిన కిరణాలు

మాకవరపాలెం: స్వయం భూ లింగాన్ని సూర్య కిరణాలు తాకాయి. పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వయం భూలింగాన్ని ఏటా శివరాత్రి ముందు సూర్యకిరణాలు తాకుతాయి. ఈ నేపథ్యంలో బుధవారం కూడా లింగాన్ని సూర్య కిరణాలు తాకాయి. దీంతో ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు పరవశించిపోయారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

గొలుగొండ: రావణాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని రథంపై ఊరేగించి, సారె సమర్పించారు. ఊరేగింపు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చోద్యం పీఏసీఎస్ చైర్మన్ పెద్దిరాజు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

167 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 167 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పొంగలిపాకలో...

మాడుగుల రూరల్: మండలంలో కింతలి పీహెచ్‌సీ పరిధిలో పొంగలిపాక గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 49 మందికి వైద్యాధికారి కె.ఎం.నాయుడు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్‌ఎం లక్ష్మి, 104 సిబ్బంది శీరంరెడ్డి భార్గవ్, గంగాధర్ తదితర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై కళాజాత

గొలుగొండ: బ్యాంక్ లావాదేవీల్లో వినియోగదార్లు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు బ్యాంక్ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని గొలుగొండ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ గిరిబాబు తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై బుధవారం బ్యాంక్ వద్ద కళాజాత నిర్వహించారు. మోసాలు, బ్యాంక్ రుణాలు, చెల్లింపులపై అవగాహన కల్పించారు.

చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలి

గొలుగొండ: విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం వి.నాగభూషణం అన్నారు. హైస్కూల్ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

దేవరాపల్లి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాశాఖాధికారి బి.పడాల్‌దాస్ విద్యార్థులకు సూచించారు. పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు బుధవారం హాల్‌టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.

రెండు బోర్లు మంజూరు



బోరు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీను వినతి మేరకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆగ్రామానికి రెండు బోర్లు మంజూరు చేశారు. పైడితల్లమ్మ,పేరంటాలమ్మ ఆలయాల వద్ద బుధవారం బోరు పనులను జెడ్పీటీసీ దొండా రాంబాబు,ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవిలు ప్రారంభించారు. సర్పంచ్ గొలజాన శ్రీను, నాయకులు జోగా కొండబాబు, గోపిశెట్టి శ్రీను, పినపోలు రామునాయుడు,నాయుడు, గణేష్, రాము,ప్రకాష్,రాజబాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



బుచ్చింపేటలో శివపార్వతులు విగ్రహాలు



రోలుగుంటలో కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం



కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రోలుగుంట కొండపైనున్న జగ్గారాయుడి గుడి

రోలుగుంట: శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు శివాలయాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరిస్తున్నారు.ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండడంతో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీల సభ్యులు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. విశాఖ కైలాసగిరిపై గల శివపార్వతి విగ్రహాల మాదిరిగా బుచ్చింపేట కొండపైన స్థానికులు ఏర్పాటు చేసిన భారీ శివపార్వతుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా రోలుగుంటలోని కాశీ విశ్వేశ్వరమృత్యుంజయ ఆలయం వద్ద భారీ ఎత్తున విద్యుత్‌దీపాలంకరణ చేశారు. ఇక్కడ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గ్రామంలో కొండపైనున్న జగ్గారాయుడి గుడి వద్ద కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ స్వామిని దర్శించుకుని, పూజలు చేస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని స్థానికుల నమ్మకం. దీంతో ఈ ఆలయానికి విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున వెళ్లి, స్వామిని దర్శించుకుంటారు. నిండుగొండలో శత అష్టోత్తర శివలింగాలతో నిర్మితమైన శివాలయం వద్ద శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసింది.

నేటి సీఎం సభను విజయ వంతం చేయాలి



స్వయంభూ గౌరీశ్వరస్వామిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అనకాపల్లి మండలం మండలం పిసినికాడ గ్రామ సమీపంలో గురువారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కోరారు. ఈ సభలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి... మహిళలకు చేయూత చెక్కు అందిస్తారని చెప్పారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామిని బుధవారం ధర్మశ్రీ దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు చోడవరం నియోజకవర్గంలో ఉన్న చేయూత లబ్ధిదారులైన మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ధర్మశ్రీ కోరారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పూజలు



లలితాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ



అప్పలరాజుపురంలో ప్రచారం చేస్తున్న బూడి రమణమ్మ

చీడికాడ: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ అప్పలరాజుపురంలోని శ్రీలలితా దేవి, చీడికాడ శివాలయం, తురువోలు ఆలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ బుధవారం పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పలు కుటుంబాలను కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆమె వెంట ఎంపీపీ కురచా జయమ్మ, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, పార్టీ నేతలు చుక్కా అప్పలనాయుడు, షేక్ సూర్యానారాయణ, గెంజి బాలాజీ, ఈర్లె చైతన్య, పరువాడ మహేష్‌తో పాటు దేవరాపల్లి, కె.కోటపాడుకు చెందిన పార్టీ నేతలున్నారు.

ఎన్నికల విధుల్లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు అవకాశం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం రూరల్: ఎన్నికల్లో సేవలందించే అవకాశాన్ని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు కల్పించారని, అలా విధులు నిర్వహించే వారికి ప్రశంసాపత్రాలు అందచేస్తారని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రత్నభారతి, డి.మాల్యాద్రి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఓటుహక్కు విలువ తెలుసుకోవడమే కాకుండా ఇతరులకు ఓటు ప్రాధాన్యతను వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు వీలుగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు శిక్షణఇవ్వాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపన్యాసకులు ఎస్‌ఎం.రఫీఉద్దీన్, అల్యూమిని కోఆర్డినేటర్ జి.నారాయణమూర్తి, సుధీర్, వి.అప్పలనాయుడు, ఎ.కృష్ణారావు, ఐ.వి.సత్యవతి, లక్ష్మీమంగమ్మ పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రవిబాబు



మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు

నర్సీపట్నం: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు ఉన్న వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించిందని మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడ్డీ రాయితీని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్ను బకాయిపడిన వారికి వంద శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పన్నుభారం నుంచి ప్రజలకు ఉపశమనం కలిపస్తూ ప్రభుత్వం వన్‌టైంసెటిల్‌మెంట్(ఓటీఎస్)కు అవకాశం కల్పించినట్టు చెప్పారు. ఈ నెలాఖరు నాటికి భవన, ఖాళీ స్థలాల యజమానులు ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన వారికి కూడా ప్రభుత్వ నిర్ణయంతో మేలు చేకూరుతుందన్నారు. ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన వారు ఎంత చెల్లించారో వడ్డీ లెక్కగట్టి వచ్చే ఏడాది ఆస్తి పన్నులో ఆ మొత్తాన్ని తగ్గిస్తామన్నారు. ఆస్తి పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ వర్తించాలంటే ఈ నెల 31లోగా చెల్లించాలన్నారు. పురపాలక సంఘం పరిధిలో 13,940 ప్రైవేటు, ప్రభుత్వ భవనాలు ఉన్నాయని, మొత్తం వసూలు కావాల్సిన పన్ను రూ.5.49 కోట్లని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2.18 కోట్లు వసూలైందని తెలిపారు. గత ఏడాది రూ.3.30 కోట్లు వసూలు అయినట్టు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ అవకాశంతో ఈ ఏడాది నూటికి నూరు శాతం పన్ను వసూలు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

81 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట : మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరంలో 81 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సుంకరి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు హరిచందన, క్యాంపు కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తమ సిబ్బందితో రోగులకు కంటి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. 20 మందికి దృష్టి లోపం ఉండడంతో ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో ఇద్దరికి పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న నారాయణరావు

నర్సీపట్నం: రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించారు. సబ్ జూనియర్ బాక్సింగ్ టోర్నమెంట్ ఈ నెల 1 నుంచి 3 వరకు జరిగింది. బాలికల విభాగంలో నింజాస్ అకాడమీకి చెందిన కె.శరణ్య 45 కిలోల విభాగం, కె.హర్షిత 64 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారు. వీరిని అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, సీనియర్ కోచ్ శేఖర్ అభినందించారు.

శభాష్ వలంటీర్



పింఛన్ అందిస్తున్న వలంటీర్ దుర్గాప్రసాద్

రావికమతం: అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందజేసి మేడివాడ గ్రామ వలంటీర్ దుర్గాప్రసాద్ మానవత్వం చాటుకున్నాడు. ఆ గ్రామానికి చెందిన బంగారు బండేసు కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకుని బుధవారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేయడంతో పాటు ఆయన ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నాడు. దీంతో బండేసు కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



తామరం సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.చంద్రరావు సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని తామరం, మాకవరపాలెం సచివాలయాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను పరిశీలించారు. కొందరు సిబ్బంది విధులకు గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు డుమ్మా కొట్టిన వారికి మెమోలు జారీ చేశారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

నర్సీపట్నం: సారా అమ్ముతున్న మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఏతపేటలో సారా విక్రయిస్తున్న పి.పెద్దమ్మ(55)ను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

రైవాడలో ప్రమాదవశాత్తూ పడి ఒకరి మృతి



సత్తిబాబు మృతదేహం

దేవరాపల్లి : రైవాడ జలాశయంలో ప్రమాదవశాత్తూ జారి పడి దేవరాపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లికి చెందిన దీవి సత్తిబాబు (45) కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైవాడ జలాశయంలోకి దిగి ప్రమాదశాత్తూ కాలు జారి నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె నవ్య ఉన్నారు. విగతజీవిగా మారిన సత్తిబాబును చూసి భార్య, కుమార్తె ఇతర కుటుంబ సభ్యులు చూసి గుండెలవిసేలా రోదించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

ఘనంగా భక్తాంజనేయ స్వామి తీర్థం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: మండల కేంద్రం రావికమతంలో శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం ఘనంగా తీర్థ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామంలో ఎడ్లబళ్ల పరుగు పోటీలను నిర్వహించారు. నర్సయ్యపేట, కె.ఎల్.వి.పట్నం , కె.జె.పురం, గుడిప తదితర 15 గ్రామాల నుంచి 16 బళ్ల ఈ పోటీలో పాల్గొన్నాయి. ప్రథమ,ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ, ఆరవ విజేతలను ఎంపిక చేసి ఉత్సవ కమిటీ నిర్వాహకులు నగదు బహుమతులందించారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై చులకన భావం వద్దు

నర్సీపట్నం:ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను చులకన భావంతో చూడవద్దని మెడికల్ ఆఫీసర్ ఎ.ప్రియాంక తెలిపారు.చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో నెట్ వర్కు కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు ఏవిధమైన సమస్యలు ఎదుర్కొన్నా తమ దృష్టికి తీసుకువచ్చినట్టయితే పరిష్కరిస్తామన్నారు.

ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



ఎం. కోడూరులో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పోతురాజులబాబు తీర్థం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8న నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కె.జె.పురంలో విడుదల చేశారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో జరిగే కల్యాణోత్సవాలకు హాజరు కావాలని డిప్యూటీ సీఎంను ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ రాజారామ్, ఎం.కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, పడాల అప్పలనర్సయ్య, కోన అప్పలనాయుడు, స్థానిక నాయకులు కాళ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోతురాజులబాబు తీర్థం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల రూరల్: స్థానిక మామిడి వారి కళ్లాలలో వెలసిన పోతురాజులబాబు తీర్థాన్ని ఈనెల 8న మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్నారు. ఈ తీర్థం వాల్ పోస్టర్‌ను బుధవారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మామిడి సత్తిబాబు, కర్రి బుజ్జి, సోమురెడ్డి నూకరాజు, కొండబాబు, కర్రి రామారావు పాల్గొన్నారు.

జగనన్న ముఖ్యమంత్రిగా గెలిస్తేనే సంక్షేమ పథకాలు అమలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బుచ్చెయ్యపేట: ముఖ్యమంత్రిగా జగనన్న రెండోవసారి గెలిస్తేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గేదెల శేషులు తెలిపారు. బుధవారం మల్లాం, ఆర్ భీమవరం, ఆర్ శివరాంపురం గ్రామాల్లో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు, గత టీడీపీ పాలనలో చేసిన అవినీతి, దోపిడీ గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను,ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నా... తప్పుడు ఆరోపణలు మానుకో



మాట్లాడుతున్న ఎంపీపీ రుత్తల సత్యనారాయణ

మాకవరపాలెం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు మాజీమంత్రి అయ్యన్నపాత్రుడికి సూచించారు. లచ్చన్నపాలెంలో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టిన అయ్యన్న చేసిన ఆరోపణలను స్థానిక నేతలతో కలసి వారు ఖండించారు. ఒక్క లచ్చన్నపాలెంలోనే 48 మందికి ఇళ్లస్థలాలు, మరో 24 మందికి గృహనిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ గ్రామంలో సంక్షేమ పథకాల రూపంలో రూ.25 కోట్లకుపైగా ప్రజలకు లబ్ధికలిగిందన్నారు. ఎమ్మెల్యే గణేష్ అభివృద్ధి చేయలేదని చెప్పే అయ్యన్న గత 40 ఏళ్లలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసునన్నారు. మీ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం చేసుకోవాలి తప్పితే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, యూత్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కన్నూరు నాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, లచ్చన్నపాలెం మాజీ సర్పంచ్ పోతల వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు త్వరలో మరమ్మతులు

నాతవరం: అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్టు గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలనకు ఇక్కడికి వచ్చిన ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. నాతవరం మండలంలో 59 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ.58 లక్షలు, గొలుగొండ మండలంలో 37 కేంద్రాల మరమ్మతులకు రూ. 38 లక్షలను ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు చేపట్టి ఈనెలాఖరులో పూర్తి చేస్తామని చె ప్పారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

పీహెచ్‌సీ అదనపు భవనానికి నిధులు మంజూరు

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



రోడ్డు పనులపై ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డితో చర్చిస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: మండలంలోని గునుపూడి పీహెచ్‌సీలో అదనపు భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన బుధవారం ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి జేఈ నారాయణరెడ్డి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్లు ఖరారు చేసిన వెంటనే కాంట్రాక్టర్‌తో యుద్ధప్రతిపాదికన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామన్నారు. గన్నవరం మెట్ట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గన్నవరం మీదగా వై.బి.పట్నంలో జిల్లా సరిహద్దు వరకు సుమారుగా 3కిలో మీటర్లు రోడ్డు మరమ్మతులకు, వల్లంపేట జంక్షన్ నుంచి నాతవరం పీహెచ్‌సీ మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.10 లక్షల చొప్పున మంజూరైనట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ రెండు రోడ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మరమ్మతు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చమ్మచింత , సరుగుడు మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని జేఈ తెలిపారు.